ప్రజాశక్తి

సోమవారం 1 జనవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





న్యూ ఇయర్ జోష్



2023కి బైబై చెబుతూ.. 2024 రానే వచ్చేసింది. ఈ కొత్త సంవత్సర వేళ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా ఆర్‌కె బీచ్‌లో ఆదివారం సాయంత్రం నుంచే జోష్ ఫుల్ వాతావరణం కనిపించింది. సరిగ్గా నూతన సంవత్సరంలోకి అడుగిడగానే అందరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నిర్బంధం ఆపి, కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే..

వైసిపి ప్రభుత్వ పతనం తప్పదు

- కార్మిక, ప్రజాసంఘాలు హెచ్చరిక
- విశాఖలో భారీ సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష అభియాన్ కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, వారిపై రాష్ట్ర వైసిపి ప్రభుత్వం నిర్బంధం ఆపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం విశాఖ నగరంలో కార్మిక, ప్రజా సంఘాలు భారీ సంఘీభావ ప్రదర్శన నిర్వహించాయి. సరస్వతీ పార్క్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు జరిగిన ప్రదర్శన అనంతరం సభ నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి



విశాఖ నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, ప్రజా సంఘాలు

మిగతా 2లో..

బాలిక గ్యాంగ్ రేప్

వార్త మెయిన్‌లో..

విశాఖలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని అడ్డుకున్న మున్సిపల్ కార్మికులు

వార్త 4లో..



సమ్మె విచ్ఛిన్న కుట్రలను తిప్పికొడుతూ..

మొదటి పేజీ తరువాయి..

వైసిపి ప్రభుత్వ పతనం తప్పదు

అధ్యక్షత వహించారు. సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య మాట్లాడుతూ అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష అభియాన్ కార్మికులు దీర్ఘకాలం తమ సమస్యలపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారన్నారు. ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చారన్నారు. వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారని, అయినా ఫలితం లేకపోవడంతో తప్పని స్థితిలో సమ్మెకు దిగారని తెలిపారు. దీనికి రాష్ట్ర వైసిపి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తక్షణమే ఆ సంఘాల రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై నిర్బంధం నిలిపివేయాలని, లేనిపక్షంలో జగన్ ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా సెంటర్ల తాళాలు పగలగొట్టించి వేరే వారితో పని చేయించి ప్రభుత్వం కార్మికులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. దౌర్జన్యం ద్వారా ప్రభుత్వం పాలన సాగిస్తుందా ? అని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు గ్రాడ్యుటీ చెల్లింపు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు.

సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను అరెస్టులు చేయించి స్టేషన్లలో నిర్బంధిస్తున్నారన్నారు. అక్రమ కేసులు పెడుతున్నారని, నాయకులను గృహ నిర్బంధం చేస్తున్నారని తెలిపారు. ఇతర కార్మికులను ఉసిగొల్పుతున్నారన్నారు. కార్మికులపైనా, ప్రజా ఉద్యమాలపైనా నిర్బంధం ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టలేదని జగన్మోహన్ రెడ్డి గ్రహించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్ వంటి ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు బి.పుష్పలత, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి రోహిణి, ఎఐటియుసి జిల్లా నాయకులు పడాల రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, ముఠా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు జె.రామకృష్ణ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.అనసూయ, తోపుడు బండ్ల సంఘం జిల్లా అధ్యక్షులు పి.మూర్తి, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.హరి, గొడౌన్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎ.నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, భారత్ బచావో కన్వీనర్ శ్రీనివాసరావు, హాస్పిటల్స్ యూనియన్ నాయకులు పి.వెంకటరావు పాల్గొన్నారు.



ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు

స్వర్ణ భారతి బ్యాడ్మింటన్ లీగ్ విజేతగా డేవిడ్ ఫైటర్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లింగ్-మెఇ ప్రాధాన్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్వర్ణభారతి బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా లీగ్ నిర్వాహకులు ఆసిఫ్, అదిత్యలు మీడియాతో మాట్లాడుతూ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ శశి అత్తిలి, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణారెడ్డి హాజరయ్యారని తెలిపారు. స్వర్ణ భారతి స్టేడియం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా ఇలా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ పోటీలు ఐపిఎల్ తరహాలో సాగాయన్నారు. ఎనిమిది జట్లు తలపడ్డాయని, మొత్తం 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఆటగాళ్లను వేలం పద్ధతిలో ఎనిమిది జట్లుగా విభజించినట్టు తెలిపారు. ఫైనల్‌లో డేవిడ్ ఫైటర్స్ - అన్‌స్టాపబుల్స్ జట్లు తలపడగా డేవిడ్ ఫైటర్స్ విజేతగా నిలిచిందన్నారు.

రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమ్మ నాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బూరాడ సత్యనారాయణ పాత్రుడు ఏడో వర్ధంతిని పురస్కరించుకుని ట్రస్ట్ చైర్మన్ పిళ్లా వెంకటరత్నం, మేనేజింగ్ ట్రస్టీ బూరాడ వెంకటరమణలు దక్షిణ నియోజకవర్గం 39వ వార్డు కోటవీధి పోర్టు క్యాథలిక్ గర్ల్స్ స్కూల్ సందులో చలితో సతమతమవుతున్న నిరుపేదలకు, వృద్ధులకు 300 రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పెదవాల్తేర్‌లోని అంధుల పాఠశాలలో 200 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శులు వర్దుపర్తి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గొంప గోవింద్, విశాఖ జిల్లా నగరాల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కొరికాన మోహన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణ్ పాల్గొన్నారు.

త్వరలో కొత్త బస్సులు

సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు
- ఎపిఎస్ ఆర్‌టిసి అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి





ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాకు త్వరలో కొత్త బస్సులు వచ్చే అవకాశముందని ఎపిఎస్ ఆర్‌టిసి అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి తెలిపారు. సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు వెల్లడించారు. 'ప్రజాశక్తి'తో ఆమె ముచ్చటిస్తూ పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలో ఎన్ని బస్సులు నడుస్తున్నాయి ?

అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి డిపో నుంచి 60 ఆర్‌టిసి బస్సులు, 35 ప్రైవేటు హైర్ బస్సులు నడుపుతున్నాం. నర్సీపట్నం డిపో నుంచి 107 బస్సులు 40 రూట్లలో నడుపుతున్నాం. రోజుకు 66 వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి.

సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారా ?

సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రతి ఏటా విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. అలాగే ఈ ఏడాది హైదరాబాద్‌కు ప్రతిరోజూ ఐదు బస్సులు రెగ్యులర్‌గా డిసెంబర్ 8 నుంచి నడిపేందుకు చర్యలు తీసుకున్నాం.

అయితే, ప్రస్తుతం రెండు బస్సులు హైదరాబాద్‌కు నడుస్తున్నాయి. జనవరి 8 నుంచి 20 వరకు ఐదు బస్సులు క్రమం తప్పకుండా వెళ్తాయి.

ఆదాయ పరిస్థితి ఏంటి ?

అనకాపల్లి జోన్ పరిధిలో ఆక్యుపేషన్ రేటు 72 శాతం నుంచి 76కు పెరిగింది. జోన్‌లో ఒఆర్‌లో ప్రథమ స్థానంలో ఉన్నాం. కార్గోలో జోన్‌లో రెండో స్థానంలో ఉన్నాం. కార్గో ద్వారా రోజుకు 65 వేల రూపాయల ఆదాయం వస్తోంది.

కొత్త బస్సుల ప్రతిపాదనలు ఉన్నాయా ?

ఫిబ్రవరి, మార్చి నెలల్లో కొత్త బస్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో ఇప్పటికే పాత బస్సుల స్థానంలో కొత్త వాటిని తీసుకున్నందున మరో రెండు బస్సులు కొత్తవి వచ్చే అవకాశం ఉంది. ప్రయాణికులకు, ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.

విశాఖకు అమృత్ భారత్ రైలు

ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రముఖులు
7 నుంచి అందుబాటులో రెగ్యులర్ సర్వీస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శనివారం ప్రారంభమైన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒకటైన మాల్దా టౌన్-ఎస్ఎంవిబి టెర్మినల్ (బెంగళూరు) రైలు స్టార్ట్ రన్‌లో భాగంగా ఆదివారం ఉదయం వాల్తేరు డివిజన్‌లోకి ప్రవేశించింది. మధ్యాహ్నం 1:45 గంటలకు విశాఖపట్నం చేరుకున్న ఆ రైలుకు వాల్తేర్ డివిజన్ రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కూటికుప్పల సూర్యారావు, నగర మేయర్ హరి వెంకట కుమారి, స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజులతో పాటు వాల్తేరు డిఆర్ఎం సౌరవ్ ప్రసాద్, ఇతర అధికారుల బృందం పాల్గొని దేశ ప్రజలకు రైల్వేలు అందిస్తున్న సౌకర్యాలను, సేవలను ప్రశంసించారు.

ఈ రైలు ప్రత్యేకతలు

ఈ రైలు ఎయిర్ కండిషన్ లేని కోచ్‌లతో కూడిన ఎల్‌హెచ్‌బి పుష్ పుల్ విభాగానికి చెందినది. రెండు చివర్లలో రెండు లోకోలను కలిగి ఉంటుంది. ఆకర్షణీయంగా డిజైన్ చేయబడిన సీట్లు, మెరుగైన లగేజీ ర్యాక్, మొబైల్ హోల్డర్‌తో మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, ఎల్ఇడి లైట్లు, సీసీ టివి, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటి మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. 22 కోచ్‌లను కలిగి ఉంది. అందులో అన్‌రిజర్వ్ ప్రయాణికుల కోసం 8 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు, 12 సెకండ్ క్లాస్ 3-టైర్ స్లీపర్ కోచ్‌లు, రెండు గార్డు కంపార్ట్‌మెంట్లు కలిగి ఉంది. మొత్తం 1834 మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యం కలిగి ఉంది. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం కలిగినటువంటిది.

ప్రారంభ సర్వీస్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

విశాఖకు చెందిన పలు స్కూళ్ల విద్యార్థులను, మీడియా ప్రతినిధులను శ్రీకాకుళం తీసుకువెళ్ళి అక్కడి నుండి ఈ అమత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో విశాఖకు తీసుకువచ్చారు. మార్గం పొడవునా రైలులో ఉండే సౌకర్యాలను, సదుపాయాలను మీడియా వారికి వివరించారు.

రెగ్యులర్ సర్వీసు ఇలా..

13434 మాల్దా టౌన్ - ఎస్‌విఎంటి బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ మాల్దా టౌన్ నుంచి 7 జనవరి 2024 నుంచి ప్రతి ఆదివారం ఉదయం 08.50కి మాల్దా టౌన్‌లో బయలుదేరి మరుసటిరోజు సోమవారం ఉదయం 05.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. మరలా 05.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మంగళవారం ఉదయం 03.00 గంటలకు గమ్యస్థానం ఎస్‌విఎంటి బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు దిశలో 13433 ఎస్‌విఎంటి బెంగళూరు-మాల్దా టౌన్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఎస్‌విఎంటి బెంగళూరు రైలు 09 జనవరి 2024 నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 13.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు బుధవారం ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 10.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు గురువారం ఉదయం 11.00 గంటలకు మాల్దా పట్టణానికి చేరుకుంటుంది.

ఉత్సాహంగా వైశ్యరాజు జ్యూయలర్స్ 5కె రన్


జ్ఞాపికలు అందుకున్నవారితో అతిథులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: వైశ్యరాజు జ్యూయలర్స్ ఆధ్వర్యాన ఆదివారం వైఎంసిఎ బీచ్ రోడ్డులో 5కె రన్ నిర్వహించారు. జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ప్రారంభించారు. మొదటి విజేతకు 2 గ్రాముల బంగారు నాణెం, రెండవ విజేతకు 100 గ్రాముల సిల్వర్ నాణెం, మూడో విజేతకు 50 గ్రాముల సిల్వర్ నాణేన్ని జివిఎంసి అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు ద్వారా అందించారు. రాబోయే కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం ఉండాలని ఆశిస్తూ నూతన ఏడాదికి స్వాగతం పలుకుదామని వైశ్యరాజు జ్యూయలర్స్ డైరక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు పేర్కొన్నారు. మన విశాఖను ఎకో వైజాగ్‌గా చూసుకోవాలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. జివిఎంసిలో ఉత్తమ సేవలందించిన వారికి జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇఎన్‌వి.నరేష్‌కుమార్, వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ డైరక్టర్లు వైశ్యరాజు నరేష్‌కుమార్‌రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ : నాగమణి

ప్రజాశక్తి- ఆనందపురం : భీమిలి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని మధురవాడకు చెందిన నాగోతు నాగమణి తెలిపారు. ఆనందపురంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, భీమిలి నుంచి స్థానికేతరులే పోటీ చేసి గెలుపొందుతున్నారని, వారు స్వలాభాలకే చూసుకుంటున్నారు తప్ప ప్రజల సమస్యపై పోరాటాలు చేయలేదని చెప్పారు. తనను ఎన్నికలలో గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. వేములవలస పువ్వుల మార్కెట్‌ను అభివృద్ధి చేస్తానని, ఆనందపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేస్తానని, స్థానికంగా ఉంటూ ప్రజల బాగోగులు చూసుకుంటానని, ఏ సమస్య ఉన్నా తక్షణమే స్పందిస్తానని, స్థానికంగానే ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలరావు

3న అమరావతిలో సర్పంచుల సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : అమరావతిలో ఈ నెల 3న సర్పంచుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి తెలిపారు. ఆనందపురంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సర్పంచుల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచులందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం పూర్వ అధ్యక్షులు ముత్యాలరావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ జంక్షన్ దగ్గర ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ జీవో నెంబర్లు 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నారసంచుల పంపిణీ


నార సంచులను పంపిణీ చేస్తున్న డాక్టర్ పివి.రమణమూర్తి తదితరులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాసవి క్లబ్, కళా హాస్పిటల్ సౌజన్యంతో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మానేపల్లి సుగుణ కుమార్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన నారసంచులను ఆదివారం కళా హాస్పిటల్ ప్రాంగణంలో పంపిణీచేశారు. నగరంలో ఉన్న పలు రైతు బజార్ల వద్ద పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నార సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ, పలు ప్రకృతి వైపరీత్యాలకు పర్యావరణ కాలుష్యమే కారణమన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లైఫ్ సేవింగ్ మెడికల్ డివైసెస్ ఎండీ కె.నాగేశ్వరావు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కందుల మధుబాబు, కందుల అమర్నాథ్, గరుడ కృష్ణ, హైవే వెంచర్స్ డైరెక్టర్ చింతాడ ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంబాలకొండలో 'గీతం' ట్రెక్కింగ్



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న గీతం విద్యార్థులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : పర్యాటక ప్రాంతాలను ముఖ్యంగా అభయారణ్యాలను పరిరక్షించుకోవాలనే నినాదంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు ఆదివారం కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్ నిర్వహించారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపీనాథ్ ఆధ్వర్యాన 50మంది వలంటీర్లు ఈ ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. అభయారణ్యాలలో జీవజాతుల ను కాలుష్యం నుంచి కాపాడుకోవాలని, పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయరాదని ఈ సందర్భంగా విద్యార్థులు బ్యానర్లను ప్రదర్శించారు. అటవీశాఖ అధికారి శివప్రసాద్ ఇకో టూరిజం ప్రాధాన్యతను, కంబాలకొండ అభయారణ్యం విశేషాలను వలంటీర్లకు వివరించారు. యువతలో సామాజిక బాధ్యతను, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజెప్పడానికి ఈ తరహా ట్రెక్కింగ్‌లను మరింతగా నిర్వహిస్తామని గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.గోపీనాథ్ తెలిపారు. కంబాలకొండ అభయారణ్యంలో విద్యార్థులకు మార్గదర్శకం వహించిన అటవీశాఖ అధికారులను అభినందించారు.

టిడిపిలో 100 మంది చేరిక


మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 74వ వార్డులోని పలు ప్రాంతాల నుంచి 100 మంది నిర్వాసిత కుటుంబాలు ఆదివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ అసమర్థత వల్లనే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరుగుతుందని ఆరోపించారు. 1000 రోజులకుపైగా కార్మికులు, నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన జగన్మోహన్‌రెడ్డి తన కేసుల కోసం కార్మికులు, నిర్వాసితుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. టిడిపి గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో భవిష్యత్తులో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. వైసిపికి ఇవి అంతిమ ఎన్నికలు అన్నారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజు కుటుంబానికి నిత్యవసర సరుకులు అందిస్తున్న లక్ష్మి

కల్లుగీత కార్మికునికి వితరణ

ప్రజాశక్తి -గాజువాక : ఎస్.రాయవరం ప్రాంతానికి చెందిన ముమ్మర రాజుకు హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మె మాట్లాడుతూ, వృత్తి పనిలో భాగంగా రాజు ఇటీవల కల్లు గీస్తూ చెట్టు మీద నుంచి పడిపోవడంతో వెన్నుపూస విరిగి మంచానికే పరిమితమయ్యారని తెలిపారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మంచాన పడడంతో తల్లి రోజు కూలి చేసి పోషించడం కష్టతరం అవుతుందని తెలిసి ఈ సహాయం చేసినట్లు చెప్పారు. రాజు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాత, శెట్టి, బలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన సంక్షేమ సంఘం అధ్యక్షులు అండిబోయిన అప్పారావు, వనము నాగేశ్వరరావు, బత్తిన రాము, ఓడిబోయిన శంకర్, పెట్ల శ్రీను, గెద్దాడ దుర్గారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభ దోహదం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదపడతాయని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పేర్కొన్నారు. జివిఎంసి 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం రజకులకాలనీలో ఆదివారం వార్డు కార్పొరేటర్ కంపా హనుక్ ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు కెకె.రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. వైస్ రాజశేఖరరెడ్డి హయంలో రజకులకు ఇళ్లు ఇచ్చారని, తర్వాత వచ్చిన టిడిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేద ప్రజలు పట్టాలు పొందలేకపోయారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్రాంతి లోపు వారికి పట్టాలు అందజేసే విధంగా చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, హరిపట్నాయక్, యాదవరాజు, బాబూరావు, దుర్గ, సన్నీ, నాయుడు, వెంకట్రావు, గంట అప్పారావు, రాంబాబు, నరసింగరావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


చిత్రకళాపరిషత్ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ హేమలత

చిత్రకళాపరిషత్ మ్యాగజైన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ములగాడ : చిత్రకళాపరిషత్ ఈ మేగజైన్‌ను పాత గాజువాకలో ఆదివారం జివిఎంసి వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఔత్సాహికులకు ఈ పత్రిక ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సృజనాత్మకత పెంపొందటానికి చిత్రకళ దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రలేఖనం పత్రిక సంపాదకులు డిఎస్.మనోహర్, సుంకర చలపతిరావు, డాక్టర్ గౌతమి పాల్గొన్నారు.

వైసిపికి కెవి.సూరిబాబు రాజీనామా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గంలో 70వ వార్డు వైసిపి ప్రధాన కార్యదర్శి, బిసి సెల్ ప్రెసిడెంట్ కురిటి వెంకట సూరిబాబు ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. గాజువాక నియోజకవర్గంలో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.



వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

వెంకటరమణ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-మాధవధార : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జనరల్ ఫోర్‌మెన్‌గా ఉద్యోగ విరమణ చేసిన పైడి వెంకటరమణ, వసంత దంపతులను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. అప్రెంటిస్ జనరల్ డిజిఎం కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి పైడి వెంకటరమణ చేసిన సేవలను గుర్తుచేశారు. ఉద్యోగ నిర్వహణలో నీతి, నిజాయతీ, నిబద్ధతతో పనిచేయడం అభినందనీయమన్నారు. వెంకటరమణ నివాసిత ప్రాంతంలో మాధవ మురళి స్టీల్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించి ఎంతోమంది ఉద్యోగులను చేర్పించి అసోసియేషన్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పైడి గిరిధర్, ఎస్‌టివి.రమణమూర్తి, వెంకట్రావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు

రైల్వే ఆసుపత్రిలో కూర్చునే సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి-వేపగుంట : రైల్వే డివిజన్ ఆసుపత్రి ఓపీ, పాస్ సెక్షన్ల వద్ద కూర్చునే సదుపాయం కల్పించాలని కోరుతూ రిటైర్డ్ ఉద్యోగులు తీర్మానం చేశారు. సింహాచలం శ్రీనివాసనగర్‌లో బంగారుతల్లి వృద్ధాశ్రమం పక్కన మామిడితోటలో ఆదివారం రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల అసోసియేషన్ మొదటి సార్వత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శి జివి.రమణ కార్యదర్శి నివేదికను సమర్పించారు. సంఘం స్థాపించిన ఈ సంవత్సర కాలంలో 150 మంది సభ్యులుగా చేరారని తెలిపారు. నూతన సంవత్సరాంతానికి సుమారు 1000 మందిని సభ్యులుగా చేర్చేందుకు సభ్యులందరూ కృషిచేయాలని కోరారు. ప్రతి సభ్యుని సమస్యనూ తమ సమస్యగా భావించినప్పుడే సంఘం పటిష్టంగా ముందుకెళ్తుందన్నారు. కార్యదర్శి నివేదికను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. రైల్వే డివిజన్ ఆసుపత్రి ఓపీ, పాస్ సెక్షన్‌కు రోజుకు సుమారు 35 నుంచి 50 మంది వరకు రిటైర్డ్ ఉద్యోగులు వస్తున్నారని, వారికి ఈ రెండు చోట్లా కూర్చునే సదుపాయం కల్పించాలన్న తీర్మానాన్ని ఆమోదించారు. ఈ విషయాన్ని డిఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కోశాధికారి ఎస్ఆర్‌కె.రాజు అకౌంట్స్‌ను సభ ముందు పెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఎన్‌వి.శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కేకులు, స్వీట్ల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని గాజువాక ఏరియాలో కేకులు, స్వీట్లు విక్రయదారులపై లీగల్ మెటరాలజీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కేకులు కొనుగోలులో తక్కువ తూనికపై 10 కేసులు, స్వీట్ ప్యాకెట్ నిబంధనలు ఉల్లంఘనపై 21 కేసులు నమోదు చేసినట్లు లీగల్ మెటరాలజీ ఉపనియంత్రికులు కెటి.రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ నియంత్రకులు పిడివి.అప్పలరాజు, ఎన్‌వి.రమణమూర్తి, రాధాకృష్ణ, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



స్వీటు దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సమ్మె విచ్ఛిన్న కుట్రలను తిప్పికొడుతూ..

- పట్టువిడువని మున్సిపల్ కార్మికులు
- ఎక్కడికక్కడ నిరసనలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ధర్మశ్రీ అడ్డగింత

మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నగా వాటిని తిప్పికొడుతూ కార్మికులు ముందుకు సాగుతున్నారు. ఆదివారమూ వారి సమ్మె కొనసాగింది. పోటీ కార్మికులను, వాహనాలను ఎక్కడికక్కడ అడ్డుకుని నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్. : ఆరు రోజులుగా సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులు ఆదివారం టౌన్ కొత్త రోడ్డు సమీపంలోని సూయజ్ ఫారం వద్ద నిర్వహిస్తున్న శిబిరం వద్ద మోకాళ్లపై నిలుచొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, రాము, ఎం.ఈశ్వరరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అధికార వైసిపి చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చారన్న విషయం తెలియడంతో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఆ ప్రాంతానికి వచ్చి ఆయన్ని అడ్డుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎక్కడికి వెళితే అక్కడ మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలు అడ్డుకొని నిరసన తెలుపుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్మికుల అరెస్టు విడుదల

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి నగరంపాలెం రహదారిలో కంఫర్ట్‌బిన్ వాహనాలను ఆదివారం పోలీసుల సహకారంతో తీసుకెళ్లే ప్రయత్నం చెయ్యగా కార్మికులు అడ్డుకున్నారు. కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్న క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. దీంతో సిఐటియు జోన్ కార్యదర్శి రాజ్‌కుమార్, సూరీడమ్మ అస్వస్థతకు గురయ్యారు. మొత్తం 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో యూనియన్ నాయకులు ఎస్.రామప్పడు, జి.కిరణ్, కార్యకర్తలు బి.నర్సింగరావు, బి.త్రినాథ్, చిన్న, వై.ఆనంద్, ఎస్.పోతురాజు ఉన్నారు. దీనికి ముందు నగరంపాలెం రోడ్డులో జరిగిన నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, వాండ్రాసి రవికుమార్ పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనులు వెలకట్టలేనివని కొనియాడారు. రోజువారి కార్యక్రమంలో భాగంగా పిఎం.పాలెంలో వంటావార్పు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.శేషుబాబు, పి.జాన్, కె.నాగరాజు, కె.అర్జునమ్మ, డి.సూరిబాబు, యు.లక్ష్మి, ఎం.సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



తగరపువలసలో జోనల్ కమిషనర్‌తో కార్మికుల వాగ్వివాదం



పెందుర్తిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

పెందుర్తి : పెందుర్తిలో మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ షేక్ షఫీ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ప్రజల జీవితాలతో బిజెపి, వైసిపి చెలగాటమాడుతున్నాయన్నారు. కార్మికులు సమస్యను పరిష్కరించకుంటే తాము కూడా మద్దతుగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధిలో పోగుబడిన చెత్తను వేరే వాహనం ద్వారా తరలించేందుకు జోనల్ కమిషనర్ బిరాము చేసిన ప్రయత్నాన్ని పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. ఎస్ఐ హరీష్, జోనల్ కమిషనర్ రాము కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమ డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని, వాటిని పరిష్కరించాలని కోరారు. జివిఎంసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, సమ్మె విచ్ఛిన్నానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలను ఎంత మాత్రమూ సాగనీయబోమని స్పష్టం చేశారు. ఈ తరహా కుట్ర పూరిత ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్, శ్రీను, వెంకట్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె ఆదివారం 6వ రోజు కొనసాగింది. జోనల్ కమిషనర్ వెంకటరమణ బలవంతంగా క్లాబ్ వెహికల్స్‌ను పోలీసుల సహకారంతో తిప్పడానికి ప్రయత్నించడంతో కార్మికులు అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు, పోలీసులతో కార్మికులకు మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. శాంతియుతంగా తాము చేస్తున్న ఉద్యమానికి అధికారులు సహకరించాలని మున్సిపల్ కార్మికులు విన్నవించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్, ఆర్. శంకరరావు, కార్మికులు జి.సత్యనారాయణ, బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్, నూకరాజు , శివకుమార్, సంతోష్, గణేష్, శ్రీను, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో వాహనాన్ని అడ్డుకున్న కార్మికులు



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి కేలండర్ల ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్నకెకె.రాజు తదితరులు

గాజువాక : ప్రజాశక్తి ముద్రించిన కేలండర్‌ను తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు తవిటయ్య, శ్రీనివాస్‌చౌదరి, తౌడన్న, మహిళా సంఘం సభ్యులు, ప్రజాశక్తి సిబ్బంది అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజాశక్తి ముద్రించిన కేలండర్లను పలుచోట్ల ఆదివారం ఆవిష్కరించారు.

సీతమ్మధార : ప్రజాశక్తి నూతన కేలండర్‌ను ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సమన్వయకర్త కెకె.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విలువలతో కూడిన వార్తలను అందించడంలో ప్రజాశక్తి దినపత్రిక ముందుంటుందన్నారు. కార్మికులు, ప్రజల సమస్యలను నిరంతరమూ వెలికితీస్తూ, నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రిక అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేటి కిరణ్‌కుమార్, కె.చిన్న, సునీల్, బోగవెల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు

'పుణ్యక్షేత్ర దర్శనాలకు ఉచితంగా పంపిస్తా'

ప్రజాశక్తి-సీతమ్మధార : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏటా పేద ముస్లిములను మక్కా యాత్రకు పంపిస్తున్న తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ నూతన సంవత్సరం సందర్భంగా పేద క్రిస్టియన్‌ను జెరుసలాం యాత్రకు, పేద హిందువును కాశీ యాత్రకు పంపించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది నుంచి అన్ని మతాల పేదలను పంపిస్తానని తెలిపారు. ఇప్పటివరకు ఆరుగురిని మక్కా యాత్రకు పంపించానని, ఈ ఏడాది నుంచి జెరూసెలం యాత్రకు వెళ్లే ఒక పేద క్రిస్టియన్‌కు రూ.50 వేలు, పేద హిందువు కాశీ యాత్రకు వెళ్లేందుకు పూర్తి ఆర్థిక సహాయం అందిస్తానని పేర్కొన్నారు. అన్ని మతాలూ తనకు ఒక్కటేనని తెలిపారు. తాను జీవించినంత కాలం ఏటా ఒక పేద ముస్లిం, ఒక పేద క్రిస్టియన్, ఒక పేద హిందువును మక్కా, జెరూసలెం, కాశీ యాత్రకు పంపుతానని హామీ ఇచ్చారు. తమ పార్టీ నేతలు లబ్దిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు.

12వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె




అనకాపల్లి డిఇఒ కార్యాలయం, విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 12వ రోజుకు చేరింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారమయ్యేంతవరకు తమకు అండగా ఉంటామని ఉపాధ్యాయ సంఘాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పట్టా కృష్ణ, పూడి వెంకట్రావు, గొట్టేటి నాగేశ్వరరావు, అచ్యుత, కృష్ణ, సతీష్, నూకేశ్వకరరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని ఎపిసిపిఎస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె ఆదివారానికి 12వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వారు తలపెట్టిన దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీంభావం తెలిపారు. కార్యక్రమంలో ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్.చైతన్య, అధ్యక్షులు పి.పుండరీకాక్ష పాల్గొన్నారు.



కాశీ మదుం ఆయకట్టును పరిశీలిస్తున్న వైసిపి నేత రత్నాకర్

సొంత నిధులతో పంట కాలువలో సిల్ట్ తీయిస్తా

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని వెదురుపర్తి గ్రామ సమీపంలో శారదా నది నుండి పంట పొలాలకు నీరందించే కాలువలో పేరుకుపోయిన సిల్టును తన సొంత నిధులతో తీయిస్తానని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. వెదురుపర్తి వద్ద శారదా నదిపై గల కాశీమదుం ఆనకట్టను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇక్కడ ఆనకట్టు పూర్తిగా దెబ్బతినడంతో నీరంతా కిందకు వృధాగా పోతుందన్నారు. ఆనకట్ట వద్ద నుంచి వెదురుపర్తి గ్రామంలో పంటలకు నీరందించే పంట కాలువ ద్వారా నీరు ప్రవహించడం లేదని, ఏడాది పొడవునా ఇక్కడ నీరున్నా ఆనకట్ట దెబ్బతినడంతో నీరంతా వృధాగా పోతుందని చెప్పారు. పంట పొలాలకు నీరందించే కాలువలో సిల్టు పెరిగిపోవడంతో నీరు ప్రవహించడం లేదని, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కూడా పంట కాలువలో సిల్టు తీయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన రత్నాకర్ పంట కాలువలో సిల్టు తీయించేందుకు తన సొంత నిధులు 30వేల రూపాయల వరకు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. కాలువవద్ద ఆనకట్టను ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చేందుకు కృషి చేస్తామన్నారు. చెరుకు గిట్టుబాటు ధర లేదని, చెరకు పంటకు తెగుళ్లు సోకడంతో పాకానికి గతంలో 10 దిమ్మల వరకు బెల్లం దిగుబడి వస్తే ఇప్పుడు 7 నుంచి 8 దిమ్మలు మాత్రమే దిగుబడి వస్తుందని, దీంతో నష్టపోతున్నామని రైతులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్యనాయిడు, దాడి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



పటం గీసి రైతులకు వివరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని పి.భీమవరంలో ఆదివారం శ్రీకాకుళం కింజరపు ఎర్రమనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థుల సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రసాయన ఎరువుల వినియోగం, రబీ సాగులో వరి యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు డి.చేతన, దివ్యశ్రీ, వై జ్ఞాన సాహితి, పి నాగదీపిక, జి. నందిత ప్రియ, డి నవ్య, స్థానిక సర్పంచ్ పినపోలు రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి స్పందన రద్దు

ప్రజాశక్తి- అనకాపల్లి

నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఎవరూ ఇతర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కి సోమవారం రావద్దని ఆయన సూచించారు.

ప్రజలకు కష్టాలు లేని రోజులు రావాలి

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి



2024 కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలకు కష్టాలు లేని రోజులు రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు ద్రోహం చేసే ప్రభుత్వాల స్థానంలో ప్రజలకు మేలుచేసే నూతన ప్రభుత్వాల ఏర్పాటుకు ఈ ఏడాది పునాదులు పడాలని కోరారు. అన్యాయం, అసమానతలు, మోసాలకు వ్యతిరేకంగా జరిగే సంఘటిత ప్రజాపోరాటాలు విస్తృతం కావాలని, వివిధ తరగతులు తమ సమస్యలపై నిర్వహించే ఉద్యమాలతో ప్రభుత్వాలకు ముకుతాడువేయాలని పేర్కొన్నారు. ప్రజలకు సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, వైద్యం, ఆహారం, తాగునీరు, సాగునీరు, రహదారుల సౌకర్యాలు అందుబాటులోకి రావాలని కోరారు.

ఎస్ఐగా ఈశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి.ఈశ్వరరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈశ్వరరావు ఎలమంచిలి ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో బుచ్చయ్యపేట ఎస్సైగా విధులు నిర్వహించిన కుమారస్వామి సిఐగా పదోన్నతి పొందారు. సీఐ కుమారస్వామి ఎస్పీ ఆఫీసులో విధుల్లో చేరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈశ్వరరావు

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ రొబ్బసింగి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం మన ఆరోగ్యం మన చేతుల్లో అనే కార్యక్రమం నిర్వహించి ఆరోగ్యం పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు పసర మందులు పట్టకూడదని, నాటు వైద్యం సరికాదని, వేడి చేసిన నీళ్లు తాగాలని, దోమలు తెరలు వాడాలని సూచించారు. అనంతరం దాతలు సహకారంతో గ్రామస్తులకు దుస్తులు, యువతకు వాలీబాల్ కిట్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు టి.మల్లేష్, సంస్థ ప్రతినిధులు తిరుపతి బాబు, లక్ష్మణ్, చిట్టిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గోపాలరాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర మార్కుఫెడ్ మాజీ ఛైర్మన్, అనకాపల్లి డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ దంతులూరి వివి.గోపాలరాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన స్వగృహంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి దుస్సాలువ కప్పి, పూలదండలు బొకేలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల ఎంపిటిసి సభ్యులు పంచదార్ల కన్నారావు, టెలికాం అడ్వైజర్ కమిటీ సభ్యులు పీలా విశ్వేశ్వరరావు, గ్రామ నాయకులు బొడ్డపాటి అచ్చయ్య నాయుడు, బొడ్డపాటి రామ్ కుమార్, వియ్యపు సింహాచలం (చంటి), బొడ్డపాటి గణేష్, ఇండో స్టార్ బ్యాంకు సీనియర్ మేనేజర్ బొడ్డపాటి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



పూలమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

డైట్‌లో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

ప్రజాశక్తి -అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటే విధంగా ఆదివారం నిర్వహించారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన వివిధ రకాల నృత్య ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. వేడుకల్లో భాగంగా కళాశాల ప్రాంగణంలో కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో "ఫుడ్ కార్నివాల్" ఏర్పాటు చేశారు. పలురకాల ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వాటిలో వివిధ రకాల రుచికరమైన బిర్యానీ, ఫ్రైడ్‌రైస్, న్యూడిల్స్, ఫిజ్జాలు, బర్గర్లు వంటి ఐటమ్స్ తోపాటు పలురకాల ఐస్‌క్రీమ్స్, కాక్‌టైల్ డ్రిరక్స్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. గేమ్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కోలాహలంగా నిర్వహించారు. గేమ్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది సమక్షంలో న్యూ ఇయర్ కేక్‌ను రత్నాకర్ చేతులమీదుగా కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, డీన్ అకాడెమిక్స్ డాక్టర్ కె.పార్వతి, అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్‌లు వేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

మినీ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి- కశింకోట : టిడిపి మినీ మ్యానిఫెస్టో, భవిష్యత్తుకు గ్యారెంటీ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కశింకోటలో ఆదివారం ఓటరు నమోదు, భవిష్యత్తు గ్యారంటీపై కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడమే లక్ష్యంగా టిడిపి శ్రేణులు పనిచేయాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారికి ఓటు హక్కు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటకోట రాము, వేగి గోపీకృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కాంగ్రెగుల సతీష్, పంచదార్ల సూరిబాబు, తాకాశి కృష్ణ, వేగి వెంకటరావు, జగన్నాథ్, బాలాజీ పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న దేవరాపల్లి మండల నాయకులు

గవిరెడ్డి పాదయాత్రలో మండల నాయకులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చేస్తున్న పాదయాత్రలో దేవరాపల్లి మండల నాయకులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యాన వీరంతా మాడుగుల బస్టాండ్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మాడుగుల కోటపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాశీపురం గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, మహిళా విభాగం అధ్యక్షురాలు చిటిమిరెడ్డి సత్యవేణి, గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


రేపటి నుండి దేవరపల్లిలో ఆధార్ సేవలు

ప్రజాశక్తి -సీలేరు : గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి సచివాలయ కేంద్రంలో మంగళవారం నుండి ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని సచివాలయ కార్యదర్శి సీదరి వెంకటేశ్వర్లు తెలిపారు. పెదవలస, లకవరపు పేట, దేవరపల్లి పంచాయతీ పరిధిలో ప్రజలు ఈ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు, ఫోన్ నెంబర్ లింక్, నూతన ఆధార్ కార్డు వంటి సేవలను పొందవచ్చునని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కుళాయి, బావి వద్ద అపరిశుభ్రత

ప్రజాశక్తి -కశింకోట

కశింకోట మండలం తాళ్లపాలెం సంత ఆర్చి వద్ద కుళాయి, బావి దగ్గర అపరిశుభ్రత తాండవిస్తోంది. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో వాడిక నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని అంటున్నారు. ఇక్కడ ప్రతి సోమవారం వారపు సంతకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు ఈ కుళాయి నీరు తాగుతూ ఉంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుళాయిలు, బావి వద్ద పరిశుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కుళాయి, బావి వద్ద పేరుకుపోయిన చెత్త, నిల్వ ఉన్న మురుగునీరు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న మెయిన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఉన్న నాగదేవతమ్మ గుడి వద్ద ఆదివారం జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల 1975 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి సుమారు 150 మంది మిత్రులు కుటుంబ సభ్యులతో హాజరై ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాయంత్రం వరకు తమ కుటుంబ సభ్యులతో కలిసి గడిపారు. ఈ సందర్భంగా తమ గత స్మృతులను జ్ఞాపకం తెచ్చుకున్నారు. 2024 సంవత్సరానికి గౌరవ అధ్యక్షులుగా పిళ్ళా రామకృష్ణ, అధ్యక్షులుగా గాజువాక మాజీ కార్పొరేటర్ షేక్ ఇస్మాయిల్, కార్యదర్శిగా మళ్ల లోకేష్, కోశాధికారిగా రాపేటి నారాయణ రావు ఎన్నికయ్యారు.

గవరపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనకాపల్లి జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాక జెమిని డ్రింక్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం అనకాపల్లి పట్టణ మున్సిపల్ గవరపాలెం హైస్కూల్ 1972-1975 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ వన సమారాధన నిర్వహించారు. సుమారు 200 మంది పాల్గొని ఆటలు పాటలు, నృత్యాలు చేసి ఎంతో సంతోషంగా గడిపారు. వివిధ పోటీలలో గెలుపొందినవారికి బహుమతులను అందజేశారు. 2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బల్లా నాగ భూషణం, కార్యదర్శి దాడి శివరామకృష్ణ, గౌరవాధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కమిటీ చైర్మన్ పిళ్లా శివ అప్పారావు, కోశాధికారి పట్నాల కృష్ణ మోహన్, ఉపాధ్యక్షులు రొబ్బి చంద్రరావు, సహాయ కార్యదర్శి పిఎస్.సత్య నారాయణ, కార్యవర్గ సభ్యులు మైలపల్లి నూకరాజు, కొత్తూర్తి రామారావు, విల్లూరి సాయి, పొన్నా చల్మాజీ, పి సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గవరపాలెం మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

3న పంచాయతీరాజ్ రాష్ట్ర సదస్సుకు హాజరు కావాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

తాడేపల్లిలో జనవరి 3న జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రాష్ట్రస్థాయి సదస్సుకు రాజకీయాలకు అతీతంగా సర్పంచులు, ఎంపిటిసీలు, జడ్పిటిసిలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు హాజరు కావాలని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు దాడి ఎరుకునాయుడు పిలుపునిచ్చారు. కె.కోటపాడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై మూడు సంవత్సరాలు కావస్తున్నా నిధులు, అధికారాలు లేక ప్రజలకు కనీస అవసరాలు తీర్చలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీలకు, మండల, జిల్లా



దాడి ఎరుకునాయుడు

పరిషత్తులకు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8660 కోట్లు దారి మళ్లించి పథకాలకు వాడుకున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్రం మంజూరు చేసిన రూ.36 వేల కోట్లు దారి మళ్లించి సొంత భవనాలకు వాడుకున్నారని ఆరోపించారు. ఈ నిధులన్నీ న్యాయంగా పంచాయతీలకు రావలసి ఉందన్నారు. ప్రస్తుతం రెండో దశ ఉద్యమం సందర్భంగా 16 డిమాండ్ల సాధన కోసం ఏర్పాటు చేస్తున్న రాష్ట్రస్థాయి సదస్సుకు అత్యధికంగా ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు:కొయ్యూరు మండలంలోని ఆర్.కొత్తూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన కుశిరెడ్డి శ్రీను అనే వ్యక్తి ట్రాక్టర్‌తో వరి చేను నూర్పిడి చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందారు.

పార్వతీనగర్ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి -సీలేరు : జికె వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి పార్వతీ నగర్ పివిటిజి గ్రామ అభివృద్ధికి ఏపీజెన్కో అధికారులు సహకరించాలని టిడిపి అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నక్క హరిహర తిరుమలరావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అధికారులు మంజూరు చేసిన సిసి రోడ్డు, పథకం ద్వారా మంచినీటి సౌకర్యం కల్పనకు పనులు చేపట్టడానికి అధికారులు తోడ్పాటు అందించాలని కోరారు. పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టవద్దని ఏపీ జెన్కో అధికారులు ఆంక్షలు విధించడం సరికాదన్నారు.

గ్రామ ప్రధాన రహదారిపై మురుగునీరు నిల్వ

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని ఊడేరు గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగునీరు నిల్వ ఉంటుంది. ఈ గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి పైప్‌లైన్ కుళాయిలు వేసేందుకు రోడ్డుకు ఇరువైపులా తవ్వారు. అయితే వాటిని కప్పకపోవడంతో ఇళ్లల్లో వాడుతున్న నీరు మెయిన్ రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో ఈ గ్రామస్తులతో పాటు ఈ గ్రామం మీదుగా రాకపోకలు సాగించే దిబ్బపాలెం, పూడేరు, గ్రామస్తులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు వార్తా పత్రికల్లో ఈ సమస్య అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. రానున్న సంక్రాంతి నేపథ్యంలో గ్రామంలో తాము ప్రయాణం చేసే రోడ్డుకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు →



విద్యా దీవెన సొమ్మును దారి మళ్లించిన జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉద్యోగులను, ఉపాధ్యాయులను, అంగన్వాడీలను, సమగ్ర శిక్షణ అభియాన్ ఉద్యోగులను, నిరుద్యోగులను, రైతులను, కార్మికులను మోసం చేసినట్లే విద్యార్థులను కూడా మోసగిస్తూ విద్య దీవెన పథకంలో మూడు వాయిదాలు సొమ్ము రూ.3500 కోట్లు జగన్ దారి మళ్లించారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని విద్య దీవెన పేరుతో వైసిపి ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుండి అమలు చేస్తుందని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను డైరెక్ట్‌గా కళాశాలకు విద్యార్థుల తరపున జమ చేసే వారిని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థి తల్లుల ఖాతాకు జమ చేస్తుండడంతో కొంతమంది తల్లులు కళాశాలలకు చెల్లించకుండా స్వప్రయోజనాలకు వాడు కుంటున్నారని, దీనివల్ల కళాశాల యజమాన్యాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాల కాలంలో నాలుగు వాయిదాలు ప్రభుత్వం ఎగ్గొట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎగ్గొట్టిన సొమ్ము ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పడం లేదని, విద్యా సంవత్సరం ముగిస్తున్నా ఫీజు మొత్తం చెల్లించకపోతే కళాశాలలు ఊరుకోవని, విద్యార్థులు తమ తమ జేబులో నుంచి కళాశాలకు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పిట్ల హరీష్, టిఎన్ఎస్ఎఫ్ అనకాపల్లి పట్టణ అధ్యక్షులు వరదా మోహన్ కాంత్, ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి సాయికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు

అంగన్వాడీల 'పోరాడుదాం ఆంధ్ర'

- ◆ వినూత్న రీతిలో ఆటలతో నిరసనలు
- ◆ సిఎం జగన్ ఫేస్ మాస్క్ టీంతో టగ్ ఆఫ్ వార్
- ◆ మంత్రి బొత్స ఫేస్ మాస్క్‌లతో కబడ్డీ
- ◆ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాల అందజేత



విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి -మునగపాక : అంగన్వాడీల 20వ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం-ఆంధ్ర'కు దీటుగా 'పోరాడుదాం-ఆంధ్ర' పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫేస్ మాస్కులతో 'టగ్ ఆఫ్ వార్' నిర్వహించారు. జగనన్న ఒక టీం, అంగన్వాడీలు ఒక టీముగా టగ్ ఆఫ్ వార్ నిర్వహించగా, జగన్మోహన్ రెడ్డి టీంపై అంగన్వాడి టీం విజయం సాధించింది. ఈ రకంగా తమ పోరాటంలో కూడా విజయం సాధిస్తామని అంగన్వాడీలు ధీమా వ్యక్తం చేశారు. 2023 సంవత్సరానికి బై బై అంటూ, 2024 సంవత్సరంలో జగనన్నకు బై బై చెప్పాల్సి వస్తుందని అంగన్వాడీలు హెచ్చరించారు. కోలాటం ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు రామలక్ష్మి, జయలక్ష్మి, హేమ, తులసి, సరస్వతి, లక్ష్మి, బేబీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అంగన్వాడీ కార్యకర్తలు ఆదివారం వినూత్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ ముఖాల మాస్కులు ధరించి అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్లో ప్రభుత్వంతో ఆడుదాం అంగన్వాడీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీలు మంత్రుల మాస్కులు ధరించి కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తనూజ, ఉమా నారాయణమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : అంగన్వాడి కార్యకర్తలు ఆదివారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆట పాటలతో నిరసన తెలిపారు. తురకలపూడి సెక్టార్ పరిధిలో అంగన్వాడి కార్యకర్తలు తురకలపూడి సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, వెంకటలక్ష్మి, చిలకమ్మ, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది సచివాలయం వద్ద ఆటపాటలతో నిరసన దీక్ష చేపట్టారు. యూనియన్ ప్రతినిధులు అమ్మాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలో అంగన్వాడీల 20వ రోజు రిలే దీక్షలకు టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిబివిఎస్ఎన్.రాజు గండి రవికుమార్, గండి ముత్యాలనాయుడు, గండి దేముడు, కోటాన అప్పారావు, యూనియన్ నేతలు వివి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, పుష్ప, జగ దీశ్వరి, వి.సుభాషిణి, ఎం. కనకమ్మ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీల సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి, ఎఐటియుసి అనుబంధ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.శ్యామలాదేవి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



అనకాపల్లిలో జగన్, బొత్స మాస్క్‌లతో కబడ్డీ



వడ్డాదిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు



మునగపాకలో టగ్ ఆఫ్‌వార్ ఆడుతున్న అంగన్వాడీలు

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

పరవాడ : అంగన్వాడీలు ఆదివారం పరవాడ బాలికల హాస్టల్‌లో అంబేద్కర్ విగ్రహానికి, వాడు చీపురుపల్లి ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి, లంకెలపాలెం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తమ సమస్యలపై అంబేద్కర్ విగ్రహానిలకు వినతిపత్రాలు అందజేసి, నినాదాలు చేశారు. వాడు చీపురుపల్లిలో ప్రభుత్వంతో కబడ్డీ ఆడుతూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, ఎస్ విజయ, జానకి, కే రత్నం, వరలక్ష్మి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రంఅందజేస్తున్న అంగన్వాడీలు

కొత్తపల్లి యువత ఆత్మీయ సమ్మేళనం

మాజీ మంత్రి రెడ్డిసత్యనారాయణకు సత్కారం



మాజీ మంత్రిని సన్మానిస్తున్న గ్రామ యువత

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని జి కొత్తపల్లి గ్రామ యువత, గ్రామస్తుల ఆత్మీయ కలయిక ఆదివారం విశాఖపట్నం ముసలోవ పార్కులో నిర్వహంచారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణను కొత్తపల్లి యువకులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన తామంతా ఇలా గ్రామంలో కష్ట సుఖాలలో, ప్రజలకు అవసరమగు సందర్భాలలో ఏకతాటిపై నడిచి సహాయ సహకారాలు అందించడంలో ఎప్పుడూ ముందే ఉంటామని స్పష్టం చేశారు. గ్రామంలో పండుగ సందర్భాలలో యువత ప్రాతినిధ్యం వహించి అనేక కార్యక్రమాలను నడిపించుటకు అందరూ ఒకే మాట పై ఐకమత్యంతో ఉంటామన్నారు. కార్యక్రమంలో పైలా యువసేన అధ్యక్షులు దొగ్గ బలరాం, రొంగలి సత్యం, రెడ్డి రాము, కొల్లి వెంకటరావు, కొల్లి పాలవెల్లి గ్రామ యువత పాల్గొన్నారు

గ్రంథాలయాల్లో 'చదవడం మా కిష్టం'



నర్సీపట్నంలో విద్యార్థులతో చదివిస్తున్న లైబ్రేరియన్ దమయంతి

ప్రజాశక్తి- నర్సీపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయధికారి పి దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు కథల పుస్తకాలను ఇచ్చి వారితో చదివించి, ఆయా కథలలోని నీతిని వివరించారు. అనంతరం ఉపాధ్యాయిని ఫాతిమాబీబీ మాట్లాడుతూ, ప్రణాళిక ప్రకారం ఎలా చదువుకోవాలో విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయం వలన లాభాలు తెలియజెప్పారు. గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇదే సమయంలో చలికాలంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం లైబ్రేరియన్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పుస్తక పఠనం, కథల పుస్తకాలు చదవడం, దేశభక్తి గీతాలు పోటీలు నిర్వహించారు.

కల్తీ మద్యం మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే!

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కల్తీ మద్యం మరణాలను ప్రభుత్వం చేసే హత్యలుగానే గుర్తించాలని జనసేన ఉత్తర నియెజకవర్గం ఇంఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. నల్ల బెలూన్లు, నల్ల దుస్తులు, నల్ల రిబ్బన్లతో, మెడలో కాళీ మద్యం బుడ్డిలతో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం జనసేన ఆధ్వర్యాన నిరసన తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మద్యపాన నిషేధం హామీ నెరవేర్చిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలని ప్లకార్డులు పట్టుకుని వారంతా నిరసన తెలియజేశారు. అనంతరం గాల్లోకి నల్ల బెలూన్స్ వదిలి వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచకుండా ముఖ్యమంత్రి జగన్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అమ్మఒడికి డబ్బులు వేసి, నాన్న బుడ్డితో డబ్బులు కొట్టేస్తున్నారని ఏద్దేవా చేశారు. తాలి తెంచే మద్యం, జగన్ పాలన మాకొద్దని ఆమె అన్నారు. కార్యక్రమంలో పార్టీ చోడవరం ఇంఛార్జి పివిఎస్ఎన్.రాజు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, శాలిని, మహిళా నాయకురాలు తెలుగు లక్ష్మి, డాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ బొడ్డేపల్లి రఘు పాల్గొన్నారు.

వాసుపల్లి మినహా వేరొకరికి టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసిపి టికెట్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు కాకుండా బిసి సామాజిక తరగతికి చెందిన వేరొకరికి ఇవ్వాలని వైసిపి 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇదే నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు టిడిపి తరపున ఎమ్మెల్యేగా నెగ్గిన వాసుపల్లి గణేష్ కుమార్ నియోజవర్గాన్ని పూర్తిగా విస్మరించారని, పదేళ్ల పదవిలో తన సొంత పనులు చేసుకున్నారు తప్ప నియోజవర్గం ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. కార్పొరేటర్లుగా తాము జివిఎంసి ద్వారా సాధించి వార్డులలో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గణేష్ కుమార్ తాను చేసినట్లుగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిసిలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. తాను పార్టీ మారేది లేదన్నారు. అయితే గణేష్ కుమార్‌కు టికెట్ ఇస్తే ఆయనకు సహకరించేది లేదన్నారు. ఇదే విషయాన్ని తమ పార్టీ పెద్దలకు చెప్పానన్నారు.

శ్రీనివాసరావుకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ యాదగిరి శ్రీనివాసరావుకు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన్ని పలువురు ఆదివారం అభినందించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, యుసిడి పీడీ పాపునాయుడు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న పాపునాయుడు

వైభవంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి .ఆదివారం రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవ అర్చక బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకీలోను అధిష్టింపచేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వారం రోజుల పాటు వంజంగి రావొద్దు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన వనజంగి కొండ సందర్శనను ఈనెల రెండవ తేదీ నుంచి తొమ్మిదవ తేదీ వరకు వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.కాలుష్యంతో నిండిన వనజంగి పర్యాటక కేంద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, రాళ్ళు, రప్పలు, పొదల తొలగింపు, రహదారి మరమ్మతులు, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం వారం రోజులపాటు వనజంగిని మూసివేస్తున్నట్లు వెల్లడించారు.

సూక్ష్మకళతో నూతన సంవత్సరానికి స్వాగతం





పెన్సిల్ ముల్లు, చెక్కపై నూతన సంవత్సరానికి స్వాగతం

ప్రజాశక్తి- నక్కపల్లి : నూతన సంవత్సరానికి సూక్ష్మకళతో సూక్ష్మ కళాకారులు స్వాగతం పలికారు. చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ తన సూక్ష్మ కళతో పెన్సిల్ ముల్లుపై 2024 చెక్కి నూతన సంవత్సరానికి స్వాగతం పలికాడు. మరో సూక్ష్మ కళాకారుడు దార్ల రవి చెక్కపై 2024 నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్నట్లుగా 3 అంకెను తొలిగించి 4 ను చేరుస్తూ చెక్కపై చక్కగా చెక్కి తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు .

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలి



రైల్వేస్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు తదితరులు

ప్రజాశక్తి -ఎస్. రాయవరం : మండలంలో చిన్నగుమ్ములూరు గ్రామానికి సమీపంలోని నర్సీపట్నం రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పున్నప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. నర్సీపట్నం రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినసపత్రం సమర్పించారు.నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఈ నెల 24 నుండి నర్సీపట్నంలో రైల్వే రిజర్వేషన్ నిలుపుదలతో ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్రిటిష్ కాలంలో నుండి ఏర్పడిన ఈ నర్సీపట్నం రైల్వేస్టేషన్ కు ఎంతో చరిత్ర ఉందని, అటువంటి చరిత్ర కలిగిన రైల్వేస్టేషన్ లో రిజర్వేషన్ కౌంటర్ నిలుపుదల చేయడం సరికాదన్నారు. దీంతో రైల్వే రిజర్వేషన్ కోసంఈ ప్రాంతం ప్రయాణికులు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుని, ఎలమంచిలి వెళ్లే పరిస్థితి కల్పించడం సరికాదన్నారు. ఈప్రాంత ప్రయాణికుల అవసరాలను, ఇబ్బందులను, ఈ రైల్వేస్టేషన్ స్టేషన్‌కు ఉన్న చరిత్రను పరిగణనలోకి తీసుకుని నిలుపుదల చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను వెంటనే పున్నప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, నాయకులు కె.ప్రసాద్, ఎ.భాస్కర్ పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో 'చాపరాయి'కి నో ఎంట్రీ

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం పరిశుభ్రత, సుందరీకరణ నేపథ్యంలో ఈనెల 2, 3 తేదీల్లో పర్యాటకులకు ప్రవేశాలకు అనుమతి లేదని ఐటిడిఎ టూరిజం కోఆర్డినేటర్, చాపరాయి జలపాతం సూపర్వైజర్ అప్పారావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చాపరాయి జలపాతాన్ని ఆకర్షనీయంగా సుందరీకరణ పనులు చేపట్టి, త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో జలపాతం మొత్తాన్ని శుభ్రం చేయడానికి రెండు రోజులు పడుతుందన్నారు